# అడివంటుకుంది

అది చీమలు దూరని చిట్టడవీకాదు.

కాకులు దూరని కారడవీకాదు ।

గెద్దలు దూరని పెద్దడవీకాదు ।।

అడవి.

అడివిలోకి చీమలుకాదు, కాకులూ గెద్దలూకూడా కావు. పెద్ద పులులు దుమ్మలగొండులూ ఎలుగ్గొడ్డులూ లేళ్ళూ దుప్పులూ అడవి పందులు మాత్రమే కాదు ।

షాహుకారి కూడా చొరబడ్డాడు ।।

అవును, షాహుకారి చొరబడిపోయేడు ।।।

సత్తియ్య షాహుకారి పల్లంలోనున్న పల్లెలో వ్యాపారంచేసి దెబ్బతినీసేడు.

ధాన్యం బస్తాలకు అడ్వాన్సుగా యిచ్చిన డబ్బులు భూస్వాములు ఎగమెడ్డీసేరు. కాతాలు పట్టుకెళ్ళినవాళ్ళు సగం సగం జమలిచ్చీసరికే తలప్రాణం తోక్కొచ్చినట్టు చేస్సీ; దివాలా తీయించీసేరు. కరణం వల్లో పడిపోయిన పెళ్ళాం ఇల్లు గుల్లచేసి ఉన్న పదీపరకా అతగాడికి దోపీసింది.

అంతేగాకుండా కూతురు ఇరవైతులాల పాతబంగారం తీసుకొని మునసబుగారబ్బాయితో లేచిపోయింది.

కక్కలేక మింగలేక ఎవరితోనూ చెప్పుకోలేక సిగ్గుకి సగం చచ్చిపోయి తరవాత బాగా ఆలోచించి పూర్తిగా చచ్చిపోదామన్న నిశ్చయానికి వచ్చేడు.

సత్తియ్య షాహూకారి అలా నిశ్చయించుకున్నవాడై ఏవిధంగా చావాలో తేల్చుకోలేక దగ్గరగానున్న అడివికి అలా నడుచుకుంటూ వెళ్ళేడు.

అడివిలో అలా చాలాదూరం వెళ్ళేడు।

కొండ తరువాత కొండ సముద్ర తరంగాల్లా సత్తియ్య సాహూకారికి అనంతంగా కనిపించేయి। పొదలూ తీగలూ చెట్లూ పచ్చ పచ్చగా చల్ల చల్లగా మనసుకు ఎంతో హాయిని కలిగించేయి। కీచురాళ్ళూ పురుగులూ చేస్తున్న ధ్వని ఒకేలాగ వినబడుతూ విచిత్రాన్ని కలిగించింది. రంగురంగుల పక్షులు కలకలా కిలకిలా అరుస్తూ ఆనందాన్నిచ్చేయి.

చచ్చిపోదామని వచ్చిన సత్తియ్య షాహూకారి మనసుకి అడివి చల్లగా హాయిగా అందంగా ఆనందంగా ప్రశాంతంగా కనిపించేసరికి "బాగుంది। అడివి చాలాబాగుంది" అనుకొని చుట్టూ చూసేడు.

కాస్తంత దూరంలో చిన్న గుబురుమీద సత్తియ్య షాహూకారి కళ్ళకు పదిళ్ళతో నున్న పల్లె కనబడింది.

పల్లెకు మూడంచులా మూడు కొండలు కోటగోడల్లా కనిపించేయి. నాలుగవవైపు పల్లెకు ముందుగా పెద్ద చింతతోపూ దాని పక్కగా సమతలంగా నున్న పల్లపు భూములూ కనిపించేయి పల్లెచుట్టూవున్న కొండవాలుల్లో కందిచేను కనులపండువుగా కనిపిస్తుంది. కొండకీ కొండకీ మధ్యని 'ఏకుమడ' చూడ్డానికి సుందరంగా వుంది.

షాహూకారి సత్తియ్య మనసుకి ఈసారి అడివి పచ్చగా పరిపూర్ణంగా ఉందనిపించింది.

చచిపోతాననుకుంటూ అడివిలో అంతదూరం నడిచివచ్చిన సత్తియ్య షాహూకారి పదిళ్ళుగా రెండువరసల్లో కనబడుతున్న ఆ పల్లెలోకి వెళ్దామనుకొని నడిచివెళ్ళేడు.

రెల్లుగడ్డితో కప్పబడిన ఇళ్ళ వరసల మధ్యన కాకీబట్టలు వేసుకున్న ఆసామీ ఒకడు మేక నొకదాన్ని బరబరా కన్నితో ఈడ్చుకొని వచ్చేస్తున్నాడు. అది రావడానికి ఇష్టంలేనట్టుగా ఈడిగిలబడి వెనక్కి

లాగుతుంది. మేకని వదిలేయమని ప్రాధేయపడుతూ నడి వయసులో నున్న ఒకామె ఏడుస్తూ వస్తుంది.

కాకీబట్టల ఆసామీ బూతులు తిడుతున్నాడు. గడపల్లో వున్న మగాళ్ళు భయం భయంగా తొంగి తొంగి చూస్తున్నారుగానీ ఎవరూ మేక దగ్గిరికిగానీ ఆడమనిషి దగ్గిరికిగానీ రాలేదు.

పల్లెలోనికి వెళ్ళగానే కనిపించిన దృశ్యానికి సత్తియ్య షాహుకారి ఆశ్చర్యపడుతూ –

"పోలీసాయన ఇక్కడి కెందుకొచ్చినట్టు చెప్మా" అనుకొని కొంచెం దగ్గరగా వెళ్ళేడు

కాకీబట్టల్లో నున్న ఆసామీ సత్తియ్య షాహుకారికి బాగా తెలిసిన వాడే। కాతాలెగ్గొట్టేసినవాళ్ళలో ఎగ్గొట్టేసిన ఒకానొక కాతాదారుడే।।

ఊళ్ళో బలాదూరుగా తిరుగుతూ; దొరికినప్పుడు పీకమొయ్యా తెగతాగుతూ; వాడుపు దొరికినప్పుడు గిన్నె ముంతా ఎత్తుకుపోయి అమ్మేస్తూ; అప్పుడప్పుడు తన్నులూ గుద్దులూ తింటూ ఒకతిన్నగా బత కడం చేతగాని కష్టడ్డానికి యిష్టపడని చింతల ఈరాసామిని కష్టంలేకుం డానే సత్తియ్య షాహుకారి పోల్చేసేడు.

"ఈరాసాంగాడేటి? పోలీసుబట్టలేటి? మేకపిల్లేటి? ఆడమనిషి బతిమిలాడ్డం మొగోళ్ళంతా బయ్యం బయ్యంగా చూస్తుండం; ఇదంతా ఏటి?" అని అలోచించుకుంటూ ఆశ్చర్యపోతూ సత్తియ్య షాహుకారి ఒకపక్కన నిలబడి చూస్తున్నాడు.

సత్తియ్య షాహుకార్ని చూడని ఈరాసామి తొందరగా ఊరుదాటి వెళ్ళిపోవాలనే ఆత్రుతతో మేకని ఈడుస్తూ ఆడమనిషిని అదిలిస్తూ–

"వొదుల్తావా నేదే నంజా। మా ఇనసమెట్టరుగోరి పెళ్ళాంగోరికి ఈ మేకపిల్ల పెంచుకోడానికొక్కావాలే। ఇది ఇవ్వియ్యకపోతే విన్నూ నీ మొగుడ్ని టొక్కల్తోయించేసి నాటీకర్రల్తోటి బాదించగల్ను। జమానం ఏటనుకొన్నావో సవరనంజికూతరా। నీకు తెలివోతే మీ మగోల్ల నడుగే। ఎల్లెల్లు।" అని వెనక్కి తోసేడు.

తూలిపడబోయి నిలదొక్కుకున్న ఆమె ఏడుస్తూ -

"బాబ్బావూ! రచ్చించాల జెమానుబావూ! రొండు కోడిపుంజు లిచ్చుకొంటాను. మేకపిల్లొదిలీ బావూ! పాణంనాగ సూసుకంతన్నాను. గొట్టాలమ్మకి మొక్కిందిబావూ అది. బాబ్బావూ ....! బాబ్బావూ ....! అని ఏడుస్తూ బతిమాలింది.

ఈరాసామికి చెడ్డ కోపంవొచ్చింది. కోపంగా -

"గంటనించీ ఒకటే పాటపాడతన్నావే సెటకారినంజా! పోలీసోల దెబ్బ తెల్దుగావాల. కానొక్కయే అయితే తాపుకు తవిడు రగతం గక్కాల." అని పైట తొలిగిన ఆమె గుండెమీద పాలిండ్ల మధ్యన దభీమని తన్నీసేడు.

ఆమె నిలువునా వెనక్కి పడిపోయింది. నోటంట తాప్కకి తవిడు రక్తమైతే ఒక్కలేదుగానీ, పడిపోయినప్పుడు అక్కడున్న రాతికి పెడత తగిలి సుళ్ళున రక్తం చిమ్మింది.

ఆమె భయంకరంగా ఒక్కసారి కేకేసి ఏడ్చింది. సత్తియ్య షాహుకారికి అన్యాయమనిపించి ఈరాసామి పోలీసుకాడని చెప్ప చితక తన్నించుదామని బుద్ధిపుట్టింది. కానీ ఎందుకో ఒక్కక్షణం ఆలోచించి -

"చూద్దుంగాని! ఈడి దబాయింపేటో తరవాత చూద్దుం" అను కొని తప్పుకున్నాడు.

పడిపోయిన ఆడమనిషి లేచి కూచుని ఏడుస్తూ కదలకుండా అలాగే ఉండిపోయింది. గడపల్లోనుండి తొంగి తొంగి చూస్తున్న మగాళ్ళకూడా ఈరాసామి దగ్గరకి రాకుండానే అలాగే ఎక్కడివాళ్ళక్కడే వుండి చూస్తున్నారు.

ఈరాసామి మేకని గబగబా బరబరా ఈడ్చుకుంటూ ఊరి బయట నున్న చింతతోపు దాటేడు. వెనకనే నడుస్తున్న సత్తియ్య షాహుకారి చింతతోపు మధ్యనున్న గెడ్డజొల మధ్యకి రానిచ్చి -

"ఒరే! ఈరిగా!" అని పిలిచేడు.

గబగబా నడుస్తూ సాధ్యమైనంత వేగంగా ఆ వూరికి దూరంగా పోవాలనుకుంటున్న ఈరాసామికి చిరపరిచితమైన కంఠస్వరం వినబడే సరికి తుళ్ళిపడి ఆగి వెనక్కి తిరిగి చూసేడు.

వెనకన షాహుకారి సత్తియ్య కనిపించేడు। ఈరాసామి ఆశ్చర్యం నుండి కాస్సేపటివరకూ తేరుకోలేదు. తరువాత –

"ఏటి సావుకోరుబావూ। మీరేటి ఇనాగ అడివిలోకొచ్చేరు?" అని పలకరించేడు.

"నవ్వడానికొచ్చేన్రా।" అన్నాడు సత్తియ్య షాహుకారి జవాబుగా.

ఈరాసామి నవ్వేడు. నవ్వేసి –

"నాతోటి ఇకటాలెందుగ్గాని సావుకోరుబావూ। ఆ చింతజావ కుచ్చుకోని మేకని గదమాయించి నడుద్దూ। బేగి దాటిద్దుంగాని" అన్నాడు.

ఈసారి సత్తియ్య షాహుకారి నవ్వేడు. నవ్వుతూనే –

"ఓరి పిరికిసన్నాసి ముండాకొడకా। అంత తొందరెందుకురా? తన్నేవోలయితే అలంతా కలిసి నీకక్కడే రేవెట్టేసి వుందురు తన్నలేదు గాబట్టీ నువ్వు మేకతో వొచ్చేసేవు. మరేం బెయ్యంనేకుగానీ నిలబడి సంగతేటో చెబుదూ।" అని నిలబెట్టి చెప్పమన్నాడు

సత్తియ్య షాహుకారి మాటలు ఈరాసామికి సబవనిపించేయి. నింపాదిగా మేకని త్రోవ పక్కనున్న కాగుచెట్టు పేనుక్కట్టి జేబులోని అగ్గిపెట్టె బీడీకట్టా తీసి ఒకటి ముట్టించి రెండు దమ్ములాగేడు తరువాత–

"అయితే అంతా సూసేవేటి సత్తియ్యబావూ." అని అడిగేడు.

సత్తియ్య మేకపక్క చతికిలబడి –

"చూస్సేన్లేరా। నువ్వు జేస్సిన అన్నేయం చూసేన్రా" అన్నాడు.

"అయితే నీదగ్గిట మరి దాయడంవెందుగ్గాని బావూ।" అని ప్రారంభించేడు.

"అక్కడ మనూర్లో బతుకునేక ఇదిగిలాగ ఈ అడువువెంటా అగంద్రా వెంటపడ్డాను. అదుగో నువ్వొచ్చి సూసినావే అది నవరగూడ।

అందలినోళ్లంతా సవల్లే. అలకేటి తెల్దు నోకం సంగతి అసలికే తెల్దు. వొణ్ణం వొండుకోడం తెల్దు. గుడ్డముక్క తొడుక్కోడం తెల్దు.

అయితే బావూ ఆలికొకటే తెలుసు. కష్టపడ్డం తెలుసు. అంతే. అదొక్కటే పన్జెయ్యడఁవే తెలుసును. ఇంకేటి తెల్దు తెల్లటి బట్టకట్టుకున్న మడిసి గట్టిగా కేకేస్తే; సావ బయ్యంపడిపోతారు. కాకీబట్టని సూత్తే పైపేణాలు పైనే వొదిలేత్తారు.

ఇక్కడి కొచ్చేను. ఈలని సూసేను. ఈల బతుకుని సూసేను. ఈ కిటుకు తెలుసుకున్నాను. తెలుసుకొని ఈ సిరిగిపోయిన కాకీ నిక్కరా కమీజూ జతసేసి ఇలాగ దిగేను. కత్రట్టుకొని జమానుబాబు నాగ దమాయించీసి ఏద్దొరికితే అది అంకించుకొని వొచ్చీసి పల్లంలో అమ్మేత్తన్నాను. ఇయాల ఎవుడి మొకంసూసి బయలెల్లేనోగానీ మాబాగా అమిరింది" అని మేకని తృప్తిగా తడిని -

"అయినా సవరసంజికూతురు వొకంతట వొదిలిందిగాదు" అని ముగించేడు.

సత్తియ్య షాహూకారి విభ్రాంతపడిపోయేడు. ఈరాసామి ఆరిపోయిన బీడీపీకని అగ్గిపుల్ల వెలిగించి ముట్టించి షాహూకారి ముఖంలోకి చూసేడు.

"బావూ! ఇది అన్నేయఁవని అనుకుంటున్నావా? కాదుబావూ! ఎంతమాత్రం కాదు. నీకు నాను సెప్పాలా? నోకం. నోఁవంతా ఇప్పుడెలాగుంది?

ఎలాగుందంటే సావుకోరు బావూ; బలివుడ్నికొట్టి బలివుడు నాక్కుంటే, బలివుడ్నికొట్టి బెమ్మదేవుడు నాక్కుంటన్నాడు. ఆ బెమ్మదేవుడుగాడ్ని ఆడమ్మ దేవుడుగాడు తన్ని మరీ నాక్కుంటండు!!

మరందుసేత నాక్కోగలిగినోడిదే నోకఁవని నాను తెలిసికొన్నాను. మరలాటప్పుడు నాకంటా బలమైనోడూ తెలివిగలోడి దగ్గిర నాను నాక్కోగల్నా? నాక్కోలేమగాక నాక్కోలేను. నాకంటా ఈ అమాయికం ముండాకొడుకులు గాఁటి ఈళ్ని కొట్టి నాను నాక్కుంటు

న్నాను. మరప్పుడికీ ఇది నాకు దక్కుతందనుకుంటన్నావేటి? దక్కనేదు.

అదుగో పల్లంల ఆకల్లమ్మిన నంజికొడుకులున్నారు. ఆలు నాకంటా సానా తెలివైన నంజికొడుకులు. నాకిచ్చిన కల్లుసుక్కల్లో నీలుపోస్సి; ఏ సంగిలోనైతే నీలు దొరక్కపోతే ఇంత ఉచ్చపోస్సి నాదగ్గిటది ఆలు నాక్కుంటన్నారు. ఆలదగ్గిట పోలీసుబావులు. పోలీసు బావుల దగ్గిట .... ? అదెవులు నాక్కుంటాన్నారో నాకు తెల్దు. ఎవుడో ఒకడు నాక్కుంటాడు.

అది బావూ! నాను సూసిన నోకం తిత్తవ." అని ముగించి బీడీ జల్లీసేడు. తరువాత –

"బావూ! అలీసిం అయిపోతంది. నోటిదగ్గిట ముద్ద పోతాది. నువ్వొత్తావా? నన్నెలిపొమ్మంటావా?! ఏదో ఒకటి బేగి తేలిసీ!" అని తేల్చేయమన్నాడు.

సత్తియ్య మెల్లగా –

"నువ్వెళ్ళురా! నేను వెనకనుండొస్తాను." అని తేల్చేసేడు.

ఈరాసామి మేకని ఈడ్చుకుంటూ వెళ్ళిపోయేడు.

షాహుకారి సత్తియ్య చాలాసేపు అలా దిమ్మెరపోయి కూచుండి పోయేడు. అతడికి కొంచెంసేపు ఈరాసామి ఈడ్చుకొనిపోతున్న మేక అరుపు వినిపించింది. మరికొంచెంసేపటికి అదీ దూరమైపోయి మరి వినిపించకుండాపోయింది నవరగూడనుండి అడమనిషి ఏడుపుమాత్రం వింతజంతువు అరుపులా సన్నగా వినిపిస్తుంది.

షాహుకారి సత్తియ్య కొంచెంసేపు మేక అరుపును గురించీ మరి కొంతసేపు ఆడమనిషి ఏడుపు గురించీ ఆలోచించి తరవాత తన పరిస్థితి గురించి చింతించడం మొదలుపెట్టేడు.

"నేనెందుకిలాగ అయిపోయేను! ముప్పైతులాల బంగారవూ; తాతలనాటి రొక్కవూ; అంతా పోయి దేశిబికారిగాడిగా ఏవిధంగా మారిపోయేను? ఆ కూతురుముండకి బుద్ధి గడ్డిమేసి, ఆ మునసబు

కొడుకుతోటి లెగసిపోయి అలాటి తలొంపులు తెచ్చిపెట్టింది. పెళ్ళాం ముండకి అ కరణపోడు ఏం మందుపెట్టేడో మిగిలిన పాతికా పరకా అదాడికి దోపేసింది. నేను యాపారఁవంతా దెబ్బతినిపించేసి అప్పులోళ్ళకి అస్తులిచ్చేసి ఇలాగ మిగిలిపోయేను ?। ఇదెందుకిలాగ జరిగినట్టుగ ?" తీవ్రంగా ప్రశ్నించుకున్నాడు. తరువాత —

"ఈరాసాంగాడు చెప్పిందే నిజం। నా కూతురుముండకంటా నాయుడు కొడుకు తెలివైనోడుగాబట్టే దాని వొంటిని పెడగొట్టేసి, వొంటి మీదనున్న నగలు తీసీగలిగేడు. బికారిముండని జేసి మూల కూకోబెట్టేడు. అది సిగ్గుకి సగం చచ్చి మరి ఇంటికి రాలేక జంతికలూ కజ్జికుండలూ పగలమ్మి రాత్రేల మునసబునాయుడి కొడుక్కి తెలీకుండా వొళ్ళమ్ముకు బతుకుతూ నాగుండెల్లో కుంపట్లు రాజేస్సింది. దాని తెలివి తక్కువ దాన్నలాగ జేస్సింది.

మా తాతలూ తండ్రులూ వాళ్ళ కాలంలో తెలివైనోళ్ళు గాబట్టి తెలివిమాలిన సంసార్ల మీద యాపారఁజేసి ఆస్తులు పోగెట్టి నాకిచ్చేరు. నేను తెలివిమాలినోడ్నయిపోయి ముడ్డికి మొల్తాడు లేనోళ్ళందరికీ కాతాలిచ్చేసి ఆస్తంతా చెల్లుజేస్సేను. అల తెలివిముందల నా తెలివి పనికి రాలేదు గాబట్టి నేనోడిపోయి చేతులు కాల్చేసుకొని లబోదిబో మంటున్నాను.

నా పెళ్ళాంముండకంటా అ కరణపోడు తెలివైనోడుగాబట్టి దాని వొంటినీ నా యింటినీ తినీసి నన్ను తలెత్తనీయకుండా జేస్సేడు

మరందుచేత అక్కడ పల్లపోళ్ళంతా నాకంటా తెలివైనోళ్ళని తేలిపోయింది. తెలివైనోళ్ళదగ్గిర తెలివిలేనోడు నష్టపోడఁవేగానీ లాభపడ్డు। పడ్డుగాక ముమ్మాటికీ పడ్డు।

నిజంగా ఈవేళ ఈ అడివిలో బతుకును గురించి ఇంత బాగా ఇడమర్చి చెప్పిన ఈరాంసాగాడు నాగ్గురువు. ఇకనా పల్లానికీ అక్కడి మనుషులకీ పదివేల దండాలెట్టేసి అడివి పట్టేయాల. ఇక్కడికి కరణపోడు రాలేడు. మునసబు కొడుకు నిమషం పుండలేడు. అదీగాకుండా ఈ

సవర్లు నాకంటా తెలివితక్కువోలు. ఎలాటి తెలివితక్కువోళ్ళంటే పోలీసు బట్టలేసి మేకని తోలుకెళిపోయి, అడిగితే తన్నిస్తే పడున్న గంగిగోవులు. మరందుచేత వీళ్ళమీదను అనగా వీళ్ళ తెలివితక్కువ తనంమీద యాపారంజేస్సి బాగుపడతాను. మరింక చావను. బతుకుతాను. పదిమంది బతుకులు తీసేసైనా నా బతుకు బాగుచేసుకుంటాను." అని సత్తియ్య షాహుకారి ఒక నిశ్చయానికి వచ్చి లేచి సవరగూడవైపు నడిచేడు.

సవరగూడలో షాహుకారి సత్తియ్య అడుగుపెట్టేసరికి ఏడుస్తున్న ఆడమనిషి చుట్టూ ఆడా మగా చిన్నపిల్లలూ మూగివుండడం చూసేడు.

పిల్లలంతా మురిగ్గా చీపికళ్ళతో పెద్ద పొట్టలతో దిగంబరంగా ఉన్నారు. మగాళ్ళంతా బెత్తెడు వెడల్పు గోచీలతో చప్పిడి ముక్కుల్తో లావుపాటి పెదవుల్తో దృఢంగా బండగా కనిపిస్తున్నారు. ఆడాళ్ళు మూరెడు మురికిట్టిన గుడ్డముక్కని మొలచుట్టూ చుట్టుకొని పై భాగాన్నంతా దిగంబరంగా వదిలేశారు. మెడల్లో రకరకాల పూసలదండలు గుండెలమీదుగా వేలబడినా అవి పైభాగాన్ని దాచలేకపోతున్నాయి. వాళ్ళంతా పొంగిన బుగ్గలతో చిన్న నుదుర్లతో అమాయకంగా కనిపిస్తున్నారు.

గేదెలమందని చూసిన కొత్తవాడు గేదెకీ గేదెకీ వున్న తేడా తెలుసుకోలేనట్టు సవర్లను మొదటసారిగా చూసిన సత్తియ్య షాహుకారికి వాళ్ళంతా ఒకేలాగ కనిపించేరు.

షాహుకారి సత్తియ్య గుంపు దగ్గరగా వెళ్ళేడు. గుంపులోనున్న ముసలామె ఏడుస్తున్న మనిషికి ఊరడింపుగా

"పల్లకోయే ఆదెమ్మా! ఎంతేడిస్తేమట్టుగ పోయింది తిరిగొస్తాదేటే? ఆ పాపిస్టోడి సేతిలో పడింది ఎప్పుడైతేమట్టుకి తింగొచ్చిందేటి? అదికి సంకటంరాకండా ఉన్నాది. దొంగసచ్చినోడు సేతికేదంతితే అదొట్టుకెళిపోతాడు పల్లకో! పల్లకో" అని ఊరడించింది.

ఆ ఊరడింపు మాటలు విని ఆదెమ్మ కన్నీళ్ళు ఉబికినట్టున్నాయి. మరీ కుమిలి కుమిలి ఏడుస్తూ

"అదికాదత్తా! పిక్కి రోడికి గొట్టాలమ్మ సూపినప్పుడు మొక్కానాను. పిక్కిరోడు నాకు దక్కినాడు. అటుమంటి మేకపిల్లని అడుకొండబోనాడు మొక్కుబడి పెల్లించనేకపోతే ఆ తల్లికి కోపవొచ్చేత్తాది! మా కుటమాం దుంపనాశినం అయిపోతాది." అంది.

అంతవంతా ఊరకచూస్తూ నులక మంచంమీద కూచున్న మగాడు

"వొల్లకోయే! ఆ మేకపిల్ల నే పోతే మరోటి! ఆ తల్లికి తెల్దేటి? నెగునెగు! అడి పాపానికి అదే పోతాడు" అని గుంపు నద్దేసించి "పొండహె! ఏటి సూత్తారు?" అని కసిరేడు.

గుంపు చెదిరిపోయింది. ఒక్కొక్కరుగా విశ్వద్దంగా వెళిపోయేరు. సత్తియ్య షాహుకారి మిగలపోయేడు. "అడి పాపానికి అదే పోతా" దన్న మాటకి లోలోపల నవ్వుకుంటున్నాడు.

చిన్నగా నవ్వుతూ ఎదరగా నిల్చున్న షాహుకారిని చూసి మంచం మీద కూచున్న అతను లేచి

"ఏం బావూ! ఎవుల నువ్వు?" అని అడిగేడు

"నన్ను సావుకారి సత్తియ్యని పిలుస్తారు. ఇక్కడ యాపారం చేద్దావనొచ్చేను."

"నాపేరు సారికిసిద్దం. నేనీ నవరగూడకి నాయిడ్ని! మరట్టగైతే యాపారానికి ఏటొట్టుకొచ్చేవు?"

"మీకేటి కావాలంటే అదొట్టుకొస్తాను."

"ఉప్పు బెల్లం పొవ్వాకు దినుసులూ ఇక్కడ వడతాయి."

"అవే వొట్టుకొస్తాను."

"వొణ్ణం తిన్నావా? వొండుకుంతావా? వొంట పేసుకుంతానంతే బత్తిం బడిసాల్లోకి తోల్తాను."

"వొండుకుంటాను."

సిద్ధంగాడు వీధిలోకి వచ్చి గట్టిగా

"ఒరే! పేసినిగా ఇట్రారా! సావుకోరుబావుకి బడిసాల సూపెట్టరా!" అని సత్తియ్య షావుకారితో

"అడుగో ఆడు పేసినిగాడు. ఏమైనా ఆడికి సెపితే తెచ్చిత్తాడు. ఆడితో ఎల్లండి." అని వెళిపోయేడు.

షావుకారి సత్తియ్య బడిసాలలో వంట చేసుకుంటూ, పేసిని గాడిని అనేక ప్రశ్నలువేసి అడివియొక్క అందులోని సంపదయొక్క అనుపానులు తెలుసుకున్నాడు.

అలాగ ఆవిధంగా అడివిలో తిన్నవాడై క్రమంగా అడివిని తినీయడం సాగించేడు.

అడ్డడు ఉప్పు అప్పుగాయిచ్చి ఆవుపడ్డల్ని జమకట్టుకున్నాడు.

పదిరూపాయలు మదుపుగా యిచ్చి పల్లపు భూములు రాయించేసుకున్నాడు.

పాయిదాలకింద జొన్నలూ కందులూ చింతపండూ విప్పపువ్వు అడ్డాకులూ మొదలైన అడివి దినుసంతా పల్లానికి దించి పట్నాలకి పంపి పెద్దగా లాభాలు పోగేసేడు.

జనరల్ ఎన్నికలూ పంచాయతీ ఎన్నికలూ పంచవర్ష ప్రణాళికలూ షావుకారి సత్తియ్య పంచలో కనకవర్షాన్ని కురిపించిపోయేయి.

బ్లాక్ రోడ్డులూ గిరిజనాభివృద్ధి పథకాలూ స్వల్పకాలిక ఋణాలూ గంజన్ కార్పొరేషన్లూ సత్తియ్య షావుకారి కనుసన్నల్లో సాగిపోయేయి.

కరణం వలలోనుండి బైటపడిన సత్తియ్య షావుకారి పెళ్ళాం ఇప్పుడు బంగారపు నగల్ని వెంటపట్టీల్ని మొయ్యలేక తీసేసి పెట్టెలో ఉంచేస్తుంది.

మునసబు కొడుకు తన్ని తగిలేయగా ఇద్దరు పిల్లల్తో ఇల్లు చేరుకున్న కూతురు ఇప్పుడు పాతికవేల రొక్కాన్ని సంగ్రహించి తండ్రికి తెలిసీ తెలియనట్టుగా దాచుకుంది.

తలమీద గంపతో ఉప్పూ పొగాకూ బెల్లం మోసి అమ్ముకుతిరిగిన సత్తియ్య షాహుకారి ఇంతవాడు అంతవాడై అంతవాడు ఆకాశాన్నంటి నంతవాడై అడివంతా తానే అయిపోయేడు.

సంవత్సరాలు సాగిపోయేయి! సత్తియ్య షాహుకారి ఇంట్లో సంపద పోగులుపడిపోయింది.

సంవత్సరాలు సాగిపోయేయి! సత్తియ్య షాహుకారి సవరగూడ మూలుగుల్ని పీల్చి వదిలీసేడు!

సంవత్సరాలు సాగిపోయేయి! గిరిజనులంతా గోచిపాతల్తో మిగిలిపోయేరు!

కానీ ఒకనాడు....!

అలా గోచిపాతల్తో మిగిలినవాళ్ళంతా ఏకమై నిలబడ్డారు!

సంవత్సరాలతరబడి సాగిపోతున్న సత్తియ్య షాహుకారి యాపారం ఎక్కడ ఏం మార్పు వచ్చిందోగాని తక్కున ఆగిపోయింది.

పది బళ్ళమీద పల్లానికి పంపిస్తున్న ధాన్యం సవరగూడ దాటి పదిగజాలు పోకుండానే చింతతోపు దగ్గర అడ్డీసి నిలబెట్టీసేరు! నిల బెట్టినవాళ్ళు నినాదాలిచ్చుకుంటూ

"ఏ ఊళ్ళోని దినుసు ఆ వూళ్ళోనే అమ్మాలన్నారు."

సవరగూడలోని చిన్నా పెద్దా ఆడా మగా ముసలీ ముతకా అంతా బళ్ళముందు నిలబడి ఒక్క బండినికూడా అడుగు కదలనివ్వలేదు.

ఇది విని సత్తియ్య షాహుకారి నిర్ఘాంతపోయేడు ఎప్పుడూలేంది ఇప్పుడిలా పట్టపగలు జరుగుతున్న ప్రతిఘటనకు అప్రతిభుడైపోయి గంటవరకూ తేరుకోలేకపోయేడు. తరువాత బుసలుకొడుతూ లేచి ఆలో చించేడు

"ఏటీ అక్రమావం? నా సరుకు నా ఇష్టప్రకారం అమ్ముకుం టాను. ఈళ్ళెవులు మద్దిన ఇలాగ అడ్డీడానికి! ఏ ఊర్లోని సరుకు ఆ ఊర్లోనే అమ్మాలని ఎక్కడ రూలుంది? ఎవుడీలకి చెప్పేడు?! ఎవుడాడు?"

"ఎవుడాడు ?" అని సత్తియ్య షాహూకారి తనను తను ప్రశ్నించు కునేసరికి అతడి కళ్ళముందు సిద్ధంగాడి కొడుకు మంగులు జ్ఞాపకావి కొచ్చేడు.

సత్తియ్య షాహూకారి కళ్ళు నిప్పులు కురిసేయి! నోరు బూతులు పలికింది. బూతులు పలుకుతున్న నోరు సిద్ధంగాడిని పిలవ మని ఆర్డరు జారీచేసింది.

సిద్ధంగాడు వచ్చేడు!

సిద్ధంగాడ్ని చూసి సత్తియ్య షాహూకారి క్షణకాలం మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా ప్రారంభించేడు.

"చూడ్రా! నాయుడూ! నాబళ్ళతోటి దాన్యం అడ్డేయడం మీకు సబవేనా ? ఇంతకుముందెప్పుడన్నా ఈ అడవిలో ఇలాపింటిది జరిగిం దేటో పెద్దోడివి నువ్వే చెప్పు ?" చెప్పమన్నాడు.

సిద్ధంగాడు చెప్పలేదు!

మళ్ళీ సత్తియ్య షాహూకారే ప్రారంభించేడు.

"నా సరుకుని నాకిష్టపడిందగ్గిర అమ్ముకుంటాను. నాయిష్టమొచ్చి నంత ధర కమ్ముతాను. ఇష్టమున్నోడు కొంటాడు. లేనోడుపోతాడు. అంతేగానీ ఇక్కడ సరుకు ఇక్కడే అమ్మాలనడం ఎంత సబబు తక్కువో చెప్పరామరి ?"

అప్పటికీ సిద్ధంగాడు ఏమీ చెప్పలేదు.

సత్తియ్య షాహూకారిలో సహనం చచ్చింది.

"ఏంరా ? మాటా పలుకూనేకుండా ముంగిలాగ ఊరుకున్నావు. ఏదో ఒకటి చెప్పిరా ?"

అప్పుడే అక్కడికి వచ్చిన మంగులు

"ఆయ్యేటి సెపతాడు సత్తియ్యబావూ! ఆ సెప్పేదేదో నాను సెపతాను." అన్నాడు.

"ఓహో లీడరుగారా ? మీ అయ్య మొకంచూచి ఊరుకుంటు న్నాను. చెప్పండి ఏటి చెపుతారో ?" అన్నాడు వెటకారంగా.

మంగులు తీవ్రంగా జవాబిచ్చేడు.

"నువ్వేం ఎక్కిరించక్కర్లేదు సావుకోరా! మా అయ్య మొకం జూసి నువ్వేం పల్లకోనక్కర్లేదు. నానూ, నీ మొకంసూసి బళ్ళతోటి దాన్నిం వొవల్ను! ఆ దాన్నింగింజల్ని మాం(వు ఇక్కడ ఈ బూమ్మీద పండించేం. నువ్వు పాయిదాకిందా పాతిక పడికీ బత్తానెక్కనా లాగిసి మాదగ్గిట గింజనేకుండా జేస్పి పల్లానికి తోలీసి: నాబాలు తీస్తన్నావు. పండించిన మాం(వంతా ఒక్కపాలైనా వొక ఏడైనా వొరణ్ణం తిన్నేదు. టెంకపిండంబలీ జొన్నపిండంబలీ దుంపా తేగా తివి ఇనాగ సస్తన్నాం! ఇకినాగ ఈపింటి యిదంతా సవ్వకూడదని కూడబలుక్కన్నాం. ఇకమట్టి ఎక్కడి పంటక్కడ ఉండవలిసిందే!"

సత్తియ్య షాహుకారికి విపరీతమైన కోపం ముంచుకొచ్చింది.

"ఉంటాదిరా! ఎక్కడిసరు కక్కడే; ఎక్కడుండవలిసినో లక్కడే వుంటాద్రా! ఒరే మంగులూ! ఎవుడు మీకిలాగ ఎగదోస్తండో నాకు తెలుసుల్నేరా! రవాణా సరుకుని అడ్డీకం అంత సులువనుకున్నావేటిరా? ఇప్పుడే ఇలాగ నిలబడినపాట్ను పోలీసుల్ని పిలిపిస్తాను. ఎలాగ వొదల్రో....మీ సంగతేటో తేలుస్తాను." అన్నాడు ఉక్రోషంగా.

మంగులు నవ్వేడు. తిరస్కారంగా నవ్వేడు. తరువాత సాహుకారి సత్తియ్యతో —

"పోలీసోళ్ళొస్తారా సత్తియ్యబావూ! నువ్వు అడ్డడు ఉప్పుకి పడ్డ పెయ్యావి పడీసుకున్నప్పుడు రావి పోలీసోలు .... రూపాయకి పందుం కందులు పాయిదా దొబ్బినప్పుడు రావి పోలీసోలు .... పదిరూపాయలకి పదెకరాల పల్లం మళ్ళు రాయించీసుకున్నప్పుడు రావి పోలీసోలు .... మా రగతం పెం(వటా కలిపి తాగిసి మమ్మను అప్పుల్లోనూ వొడ్డీల్లోనూ ఇరికించీసి దానికి యాపారం(వని పేరెట్టీసినప్పుడు రావి పోలీసుబావులు ఇప్పుడొచ్చి ఏటి సేసేత్తారు సావుకోరుబావూ! నువ్వు సేసింది సూసేం(వు. ఆ పోలీసుబావులు సేసిందికూడా సూస్పి బళ్ళమీద దాన్నిం వొదుల్తాం(వు! బేగి క్కానిచ్చీ." మని గబగబా వెళిపోయేడు.

ఆ వెనకనే సిద్ధంగాడుకూడా మాట్లాడకుండా వెళ్ళిపోయేడు.

సత్తియ్య షాహుకారి అటూ ఇటూ తిరిగేడు. హుంకరించేడు.

"చూస్తాను. ఈళ్ళ సంగతి తేల్చేస్తాను. మొక్కప్పుడు పీకిఎలిసిందానికి ఇంతదాకా ఊరుకోడం నిజంగా నాది తప్పే! ఓట్లప్పుడు జెండాలిచ్చుకొని పాటలుపాడితే, పాటలకి ఓట్లెవడిస్తాడని వొదిలీసేను. మీటింగులెట్టి గొంతుకలు చించుకున్నట్టరిస్తే పిచ్చిముండాకొడుకులు సారాకీ నోట్లుకీ ఓట్లొస్తాయిగానీ మీటింగులకీ ఊరేగింపులకీ ఓట్లు రావన్చెప్పి ఉపేక్ష చేస్సేను. మహజరు కాగితాలెట్టిన్నాడు మా ఆఫీసర్లే చూడాలగదా అనీ; ఆకలియాత్రలు నడిపించిన్నాడు ఆ లంజికొడుకులే మాడిపోయి చస్తారుగదా అనీ చూసీ చూడనట్టు వొదలీసేను. ఆ వొదల్డవేఁ కొంపమీదకొచ్చిపడింది. ఇక వొదల్డానికి ఎంతమాత్రం వీల్లేదు. ఏకు మేకై పోయింది. మేకు బాకై పోకుండా చూసొక్కోవాల! ఓరోరె గొర్రెల్లాంటి కొండ లంజికొడుకుల్లారా నేను కసాయోడ్నిరా! నాచేతుల కత్తిఉంది. కత్తికంటా గొప్పది డబ్బుంది. నాకడ్డుతగిలేరు. తగిలేరు కదరా?! కాస్కోండిక. కాస్కోండి" సత్తియ్య షాహుకారు కాస్కోమని గట్టిగానే అన్నాడు.

రాత్రి రెండుగంటలు దాటింది. నవరగూడచుట్టూ వున్న కొండల మీద పోడు అంటించడంచేత మంటలు భగభగమని మండుతుండగా కర్రలు చిటపటమని చిట్లుతున్నాయి. పాకుతున్న మంటలు తుప్పల్ని దాటుతూ పెద్ద పెద్ద పాతుకుపోయిన వృక్షాల్నికూడా తగలేస్తున్నాయి. అంటుకున్న ప్రతి కొండనుండీ అగ్ని సెగలు సెగలుగా పొగలు కక్కుతుంది.

కొత్తగా పోడుకొట్టి చదునుగాచేసి కొత్త విత్తనాలు మొలకెత్తించడంకోసం అడివిని అంటించేరు!

ఆవేళ అడివంటుకుంది!

అప్పుడు సరిగ్గా ఆరాత్రి రెండుగంటల సమయంలో సత్తియ్య షాహుకారి పెరట్లో నాలుగుపీపాల సారా కిరాయిమూక పూర్తిచేసీసి ఊగుతూ జోగుతున్నారు. ఒక్కడి చేతిలో తప్ప మిగిలినవారందరి చేతు

ళ్లోనూ సేపాటి కఱ్ఱలున్నాయి. ఆ ఒక్కడి చేతిలోమాత్రం లైసెన్సులేని నాటుతుపాకీ ఉంది.

వాడి కళ్ళెఱ్ఱగా వున్నాయి. వాడి గుండె కండపట్టి వుంది. వాడి జుత్తు రింగులుగా తిరిగివుంది. వాడి బుఱ్ఱ బుట్టలాగ కనబడుతుంది. వాడి నుదుటిమీదా బుగ్గంమీదా కంటి దిగువునా మూడో నాలుగో గాయపు మచ్చలున్నాయి. మచ్చలుండటంచేత ముఖం భయంకరంగానే కాకుండా అందవికారంగా కనబడుతుంది. వాడు సారా తాగినతరువాత జోగడం తక్కువా మాటలెక్కువా ఆడుతున్నాడు.

"స....స....సత్తియ్యబావూ! సవరనంజికొడుకులు మీ సరు కడీసిందిసాలక మీటింగెడతారా? మీ దాన్నిం ఏటిసెయ్యాలో ఆలు తీరుపు సెపతారా? ఆల పెల్లాలకేటి సెయ్యాలో మాఁవు తీరుపు సెప్పుదు వేఁటి? సెప్పు బావూ, తీరుపు సెపుదుఁవా?" అడిగేడు.

సత్తియ్య షాహుకారి క్రూరంగా నవ్వేడు.

"తీర్పులు చెప్పడానిక్కాదురా నిన్ను పిలిపించింది. దొరికిన ప్రతి లంజికొడుకునూ చిదగబొడిపించడానికి. నువ్వు తోవలకాసి ఆపని జెయ్యి!" అని వెళ్ళమన్నాడు

"మరలాగైతే కాసుకోమను బావూ! తోవలకాస్సి వొచ్చిన పెతి నంజికూతుర్నీ సెరిసీస్సి, అడ్డిన పెతి నంజికొడుకునీ నంచీసుకుంటాను."

బూతులు తిట్టేడు. పళ్ళు కొరికేడు. తుపాకీని రెండుసార్లు ముద్దెట్టుకున్నాడు. ఆఖర్న "ఇక సెలవా! సావుకోరుబావూ!" అని సెలవుతీసుకొని ముందుగా నడిచేడు. అనుచరులంతా ఊగుతూ జోగుతూ వాడి వెనక నడిచేరు.

వెళుతున్న కిరాయిగుంపును చూసి సత్తియ్య షాహుకారి మనసు చాలా తేలికై పోయింది. తేలికపడిన మనసుని తేల్చి ఆడించడానికి రమ్మూ కోకాకోలా కలిపి గళాసుల్ని గలగల్లాడించేడు.

"దెబ్బకి దెయ్యం వొదుల్తుంది. నా దాన్నిం బళ్ళు అడ్డీసింది చాలక మీటింగెడతారా? అడుక్కుంటే నంజికొడుకులికి అన్నికి మరిన్ని

కలిపి ఇద్దును దోతరపుకి దిగుతారా ? సత్తియ్య షాహుకారి సంగతి తెల్దుగావాల. ఇంతదాకా వాళ్ళ కష్టాల్ని మింగేను. ఇకనుండి వాళ్ళ రక్తం తాగుతాను." అని రమ్ము తాగీసేడు.

ఉదయం ఆరుగంటలైంది. అయినా తూర్పు కొండమీద సూర్యుడింకా ఉదయించలేదు. సవరగూడముందున్న చింతతోపు మధ్యనున్న సెలయేటి జొలలో కాగుచెట్టుకింద కిరాయిమూకంతా మాటువేసి కూచుంది. వచ్చినవాళ్ళని తన్ని తప్పల్లోకీ డొంకల్లోకీ ఈడ్చిపారేయడానికీ తరువాత గూడలోకి వెళ్ళి ఉన్నవాళ్ళను తన్నడానికీ వేసుకున్న ప్లాను అమలుజరపడానికి ఉబలాటంతో మూకంతా చాలా ఆత్రంగా ఉంది.

కానీ మీటింగుకి చుట్టుపట్ల గిరిజనులంతా ముందురోజునే గూడకి చేరుకున్నారు కొద్దిమంది మాత్రమే ఇంకా రావలసివుంది. ఈ సంగతి తెలియని కిరాయిమూక చాలామంది జనం వస్తారని కాచుకు చూస్తున్నారు.

ఆరున్నరయింది ఎవరూ రాలేదు !

కిరాయిమూక చిత్తుగా తాగడంచేతనూ రాత్రంతా నిద్దర్లేకపోవడం చేతనూ చాలా చిరాగ్గావున్నారు. త్రోవవైపు చూసి చూసి విసిగిపోయేరు. ఆఖరికి వుండబట్టలేక అందులో ఒకడు

"ఛత్ ! ఏటీ శవజాగరం ? ఒక నంజికొడుకూ రాడేటోస్ ! మన్ని చూస్సి బయ్యంపడిపోయి మీటింగు మానేసేరేటి ? ఇక్కడేం ? గూడలోకెళ్ళి చిదగబొడుద్దుం. పదోస్ !" అన్నాడు.

అలా వాడంటుండగా ముగ్గురు మగవాళ్ళూ, ఇద్దరాడవాళ్ళూ రావడం అందులో ఒకడు చూసేడు.

చూసినవాడు ఎగిరి గెంతేసేడు.

"అరుగొండ్రా ! సరింగా అందివిరిపోనారు. వెగండ్రా !" మిగతా వాళ్ళని లేపేడు.

నిముషంలో చుట్టూ కమ్మేసేరు. తుపాకీ పట్టుకున్న మచ్చల ముఖంవాడు

"ఎక్కడికిరా ఎల్తన్నారు?" అడిగేడు.

"మీటింగుకి" ముందున్నవాడు సమాధానం చెప్పేడు.

"మీయమ్మా ....! మీకెందుకురా మీటింగు? కోదు లంజికొడకల్లారా?"

"తిట్టకు మీమల్లు!" అన్నాడు రెండోవాడు.

"తిరగబడతన్నారు. తన్నండ్రా నాకొడుకుల్ని."

సేపాటి కర్రలు లేచేయి. బుర్రలు పగిలిపోయేయి. రక్తం చిమ్మింది. ముగ్గురు మగవాళ్ళూ కుప్పగా కూలిపోయేరు. కూలబడిపోయినవాళ్ళను ఎత్తి కాగుచెట్టు మొదలకి కట్టీసేరు! కారుతున్న రక్తం చెట్టు మొదలకు కొంత అంటుకొని కిందకి కారిపోతుంది

"ఇక్కడ మీటింగెట్టండ్రా! ఎవుడిసొమ్ము దొబ్బడానికిరా మీటింగులు." అని మచ్చలముఖంవాడు తెలివితప్పి ముఖం వాల్చేసివున్న గిరిజనుడి గుండెమీద గుద్దేడు.

అతడి నోటినుండి బళుక్కున బుక్కెడు రక్తంవచ్చి తలనుండి కారుతున్న రక్తంలో కలిసిపోయింది.

ఆడవాళ్ళిద్దర్ని ఇద్దరు పట్టుకొని మచ్చలముఖంవాడి దగ్గరికి తెస్తున్నారు. తెస్తున్నవాళ్ళలో ఒకడు మత్తు తలకి పట్టీకంచేత జోగిపోతున్నాడు అదే అదునుగా తీసుకొని ఇద్దరాడవాళ్ళలోనూ పొట్టిగా ఉన్నామె పట్టుకున్నవాడి చెయ్యి ఒక్కసారి విదిలించి గూడవైపుగా పరుగెత్తింది.

మచ్చలముఖంవాడు అది చూసి

"పారిపోతందిరా! పట్టుకోండి" అని పట్టుకొమ్మన్నాడు.

ఇద్దరు ఆమె వెనక పరిగెత్తారు. కానీ తాగుడుమీదుండటంచేత తీగలు తన్నుకు పడిపోయేరు. ఆమె అందకుండా దూరమైపోతుంది. మచ్చలముఖంవాడు మించిపోతుందని రాయితీసి గురిచూసి విసిరేడు!

గురితప్పలేదు. పెడతకు సరిగ్గా తగిలింది. రక్తం చిల్లున చిమ్మింది. అయినా ఆమె ఆగకుండా వెనక్కితిరిగి చూడకుండా వెళిపోయింది.

"పారిపోయిందిరా నంజికూతురు." కసిగా తిట్టేడు. తిట్టి తప్పించుకోలేక, చిక్కిపోయిన ఆమె దగ్గరకు వచ్చేడు

ఆమె బెదిరిపోయింది. కళ్ళనుండి నీళ్ళు ధారలు కడుతున్నాయి. ఒక్కొక్కసారి బెక్కుతుంది. అది చూసి మచ్చలముఖంవాడు వికటంగా నవ్వేడు. నవ్వుతూ కైపుగా

"పక్కనాగున్నావే!" అని పొగిడి రెక్కపట్టుకొని కాగుచెట్టు వెనక్కి లాగేడు. ఆమె విడిపించుకొనేందుకు ప్రయత్నించింది.

"రావటే అయితే! అందరూ సూడండ్రా నంజికూతురిని." అని వొంటిమీదనున్న బట్ట లాగేసేడు.

ఆమె కెవ్వుమంది. రెండు చేతుల్తోనూ మర్యాద దాచుకొనేందుకు ప్రయత్నించింది.

మచ్చలముఖంవాడు మళ్ళీ నవ్వేడు. ఇద్దర్ని పిల్చి చేతులూ కాళ్ళూ పట్టుకొమ్మన్నాడు. కాళ్ళు పట్టుకోడానికి వచ్చినవాడి గుండెమీద ఆమె గుభీమని తన్నింది. వాడు వెల్లికిలా పడిపోయేడు. దగ్గరగా వచ్చినవాళ్ళ ముఖంమీద కాండ్రించి ఉమ్మిసింది. అది చూసి మరి నలుగురు వచ్చి ఆమెను గట్టిగా పట్టేసేరు! ఆమె గింజుకుంది. అయినా లాభంలేకపోయింది.

మచ్చలముఖంవాడు గర్జిస్తూ

"మావోడికి గుండెలమీద తన్నేసి మొకాలమీద ఊస్తావటే! నీయమ్మ.....!" అని తిట్టి రెండు స్తనాల్నీ పిడికిట్లో పట్టుకొని మెలిపెట్టేసేడు!

ఆమె విపరీతమైన బాధతో "ఓలమ్మో!" అని మూలిగింది.

అంతే! ఆడకూతురు వొళ్ళంతా పుండైపోయింది. ఒకరి తరవాత ఒకరు చిక్కేరు. రక్కేరు. కరిచేరు. శవంలా దిగంబరంగా పడివున్న ఆమెని మచ్చలముఖంవాడు కాగుచెట్టు మొదలు దగ్గరకు కాలు పట్టుకు ఈడ్చేసి గూడవైపు తిరిగేడు.

గుంపుముందు గండ్రగొడ్డలితో; నిప్పులుకక్కుతున్న కళ్ళతో మంగులు నిల్చున్నాడు.

"ఒరే! కదిలితే కండలు కండలుకింద నరికేసి కాకులకీ గెద్దలకీ ఏత్తాను. ఎంతపనిజేస్సినార్రా నాకొడకల్లారా! ముక్కలకింద నరుకుతాన్రా?" అని పరశురాముడిలా నిలబడ్డాడు.

మచ్చలముఖంవాడు గుంపు వెనకనుండే మంగులు ముఖం చూసి హడలిపోయేడు. కళ్ళూ చేతులూ వణికేయి. ఎదుటపడితే చావు తప్పదని కొగుచెట్టు పక్కకి తప్పుకొని సరిగ్గా మంగులు గుండెకి గురిపెట్టి కాల్చేడు.

"సాటునుంచి కొట్టేవురా నవ్వు!" అని గొడ్డలి మచ్చలముఖంవాడి మీదకి విసిరేడు అది గురితప్పి కొగుచెట్టు మొదలకి అరంగుళాల లోతున దిగబడిపోయింది.

మంగులు నేలమీద పడిపోయేడు.

అంతలో గూడనుండి తండోపతండాలుగా సముద్ర తరంగాల్లాగ గిరిజనులు గొడ్డళ్ళూ కత్తులూ బాణాలతో మంగులుకి సాయపడదామని పరుగుమీద వచ్చేస్తున్నారు. అది చూసి గుండె బేజారైపోయిన కిరాయి మూకలు కాలికి బుద్ధిచెప్పి అడివిలోకి పారిపోయేరు.

గుండుదెబ్బ తిని పడిపోయిన మంగుల్నీ రక్తపుముద్దల్లా చెట్టుకి కట్టబడ్డ సోదరుల్నీ చెరచబడి శవంలా పడివున్న ఆడబిడ్డనీ గిరిజనులంతా చూసేరు. ఒక గిరిజనుడు పైమీద తువ్వాలు ఆడబిడ్డ వొంటికి కప్పేడు. అందరి కళ్ళూ అగ్ని కక్కుతుండగా మంగులు తండ్రి సిద్ధంగాడు; కొడుకుదగ్గరకు వచ్చి కూచున్నాడు తలతీసి వొడిలో పెట్టుకొని గుండెలమీదనుండి దారగా కారుతున్న బిడ్డయొక్క వనువెచ్చని రక్తాన్ని తుడవసాగేడు.

ఉబికుబికి ధారకడుతున్న రక్తాన్ని తుడవలేక రెండు కన్నీటిబొట్లు రాల్చేడు. తండ్రి కళ్ళలోకీ చూస్తూ మంగులు కళ్ళుమూసేడు.

అంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు. కొండమీద పోడుమంటల్లా అందరి హృదయాలూ భగభగ మండుతున్నాయి. జ్వాలలు కక్కుతున్నాయి. పెగలు చిమ్ముతున్నాయి.

అప్పుడు సిద్ధంగాడు లేచేడు. కొడుకు శవాన్ని భుజంమీద వేసుకున్నాడు. కొడుకు వదిలేసిన గండగొడ్డలి కుడిచేతిలోకి తీసుకున్నాడు. తీసుకొని దృఢంగా ఎత్తిపట్టుకొని గూడవైపుగా తిరిగి

“ఒరే! ఓరోరె సావుకారా?! ఈ పన్నీదేవని నాకు తెలుసున్నేరా! మా బూఁవులూ పుట్టలూ సెట్లులూ సేఁవలూ సెవటంతా దోస్సేవు! నీయింట్ల పోగేస్కొన్నావు. పోన్నే నీపాపాన నువ్వే పోతాఁవని పల్లకున్నప్పుడు సక్కగా యాపారం జేస్సేవు! నీపాపాన నువ్వు పోలేదని మాఁవు తెల్సుకోని ఏటీ యాపారవఁని అగీసరికి మా ఆడబిడ్డ మానం పెరిస్సి నాబిడ్డ పేణం తీస్సేవు. మా రగతం కళ్ళజూస్సేవు. కాస్కోరా! ఈ సిద్ధంగాడు అన్నిటికీ సిద్దపడిపోనాడు. నీ రగతం కళ్ళజూస్సి నీ జాతిని దుంపనాశనం సేసిస్తేనేగాన మాకు బతుకునేదు. నేదన్సెప్పి నువ్వే తేలిస్సేవు. కాస్కో!” అని గూడ వైపు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నడిచేడు.

వెనక గొడ్డళ్ళూ కొడవళ్ళూ బాకులూ బాణాలూ అనుసరించేయి!

అడివంటుకుంది!

చిటపట పటపట ఫెళఫెళ భగభగ భుగభుగలతో అడివంటుకుంది.

ఒక్కసారిగా అడివంతా అంటుకుంది!!

అంటుకున్న మంటలు ఆకాశాన్నంటుకున్నాయి. అన్నిదిశలా అలుముకున్నాయి!